సాక్షి మహబూబాబాద్

సోమవారం । 28 । ఆగస్టు । 2023



రాజకీయ సమాధి చేస్తాం

రాష్ట్రంలో అధికంగా ఉన్న బీసీలకు సీట్లు ఇవ్వకుంటే పార్టీలను రాజకీయ సామాధి చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ హెచ్చరించారు. - 8లో▸



వెయ్యేళ్లనాటి వరదపాశం బండ

రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో వెయ్యేళ్లనాటి వరదపాశం బండను చరిత్రకారులు గుర్తించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.6^0 /23.2^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదరకంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రామాల్లో తనిఖీ



చిన్నగూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆర్డీఓ నర్సింహరావు ఆదివారం తనిఖీ చేశారు. మండల కేంద్రంతో పాటు ఉగ్గంపల్లి తదితర గ్రామపంచాయతీలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం నర్సరీ, కంపోస్టు యార్డు, వైకుంఠధామాలను తనిఖీ చేసి మాట్లాడారు. స్పెషల్ క్యాంపు విజిట్‌లో భాగంగానే మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులను పరిశీలించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ యాకయ్య, కార్యదర్శులు సోమన్న, నివాస్ తదితరులు ఉన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి



దంతాలపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ పనితీరును మెరుగుపర్చుకొని ముందుకెళ్లాలని డీపీఓ నర్మద అన్నారు. మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం పూర్తి కావడంతో ఆదివారం మండలంలోని పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, దొనకొండ, రామవరం, రామానుజపూరం, నిదానపురం, వేములపల్లి గ్రామాల్లో వారు చేపట్టిన పనులను పరిశీలించారు. పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్స్, నర్సరీలు, జీపీ రికార్డులను పరిశీలించి వారి పనితీరును అంచనా వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల పంచాయతీ అధికారి అప్సర్ పాషా, అయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కేసముద్రం: జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వచ్చే అక్టోబర్ 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండే వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు ప్రాధాన్యతను ఆమె వివరించారు. అనంతరం కేసముద్రంవిలేజ్, కేసముద్రంస్టేషన్, పెనుగొండ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఓటరుగా నమోదుపై అవగాహన కల్పించారు. ఆమె వెంట తహసీల్దార్ నరేష్, ఆర్ఐ బాబు ఉన్నారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నెహ్రూసెంటర్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో 12 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ జలగం విజయ్ ఆదివారం తెలిపారు. 30వ తేదీన 8 బస్సులు, 31వ తేదీన 12 బస్సులు మహబూబాబాద్ నుంచి నర్సంపేట, హనుమకొండ మీదుగా హైదరాబాద్ వరకు సర్వీసులుంటాయన్నారు. డిపో నుంచి ఉండే రెగ్యులర్ సర్వీసులతో పాటు పండుగ ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని, ప్రయాణికులు గమనించి ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

- రేపు ఫ్యాక్టరీకి శంకుస్థాపన

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తోందని జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ ఆదివారం అన్నారు. తొర్రూరు మండలంలోని గోపాలగిరి గ్రామంలో ఈ నెల 29న ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని, అలాగే సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు.

జీవాల పంపిణీ వేగవంతం

- జిల్లాలో రెండో విడతలో 440 యూనిట్ల అందజేత
- 15 రోజుల్లోనే 362 యూనిట్ల పంపిణీ
- మూడు రాష్ట్రాల్లో గొర్రెల కొనుగోలు
- వచ్చే నెలలో పూర్తి చేసేలా కసరత్తు
- హర్షం వ్యక్తం చేస్తున్న గొల్ల, కురుమలు



మహబూబాబాద్: జిల్లాలో రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీని అధికారులు వేగవంతం చేశారు. గొల్ల, కురుమలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పథకం ప్రవేశపెట్టగా.. మొదటి విడతలో సమర్థవంతంగా అందజేశారు. రెండో విడత యూనిట్ల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. అయితే వచ్చేది ఎన్నికల కాలం కావడంతో రెండో విడతకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. జిల్లాలో ఇప్పటివరకు 440 యూనిట్లు అందజేయగా.. గత 15రోజుల్లోనే 362 యూనిట్లు పంపిణీ చేశారు. దీంతో గొల్ల, కురుమలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం లబ్ధిదారులు 23,754..

జిల్లాలో23,754 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా మొదటి విడతలో 11,645 మందికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో 11,276 మంది లబ్ధిదారులు పేర్లు నమోదు చేసుకోగా..1,269 మంది లబ్ధిదారులు మాత్రమే డీడీలు చెల్లించారు. కాగా మొదటి విడతలో జరిగిన పొరపాట్లు చోటుచేసుకోకుండా ప్రభుత్వం నూతన గైడ్ లైన్స్ జారీ చేసింది. ఈ మేరకు యూనిట్ల పంపిణీ ప్రక్రియ చేపడుతున్నారు. యూనిట్ ధర రూ.1,75,000 కాగా ఇందులో లబ్ధిదారుడి వాటా 25శాతం అనగా రూ 43,750 డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంది. దీని ప్రకారం యూనిట్లు కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

15 రోజుల్లో 362 యూనిట్లు..



గూడూరు మండలంలోని కొల్లాపురం గ్రామంలో జీవాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

జిల్లాలో ఈనెల 11వ తేదీ వరకు కేవలం 78 యూనిట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయితే ఈనెల 12 నుంచి 25వ తేదీ వరకు 440 యూనిట్లు పంపిణీ చేసినట్లు పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి సుధాకర్ తెలిపారు. ఈనెల 26న గూడూరు మండలంలోని కొల్లాపురం గ్రామంలో 12యూనిట్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పంపిణీ చేశారు. కాగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో గొర్రెలను కొనుగోలు చేస్తున్నారు. తొలుత ప్రతీరోజు12 యూనిట్లు పంపిణీ చేయగా.. తర్వాత 24 యూనిట్లకు పెంచారు. ప్రతీ రోజు ఎక్కువ సంఖ్యలో యూనిట్ల పంపిణీకి కసరత్తు చేస్తున్నారు.

మరింత వేగవంతం చేయాలి..

గొర్రెల యూనిట్ల పంపిణీపై గొల్ల, కురుమలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధిక సంఖ్యలో అబ్ధిదారులు ఉండడంతో యూనిట్ల పంపిణీని మరింత వేగవంతం చేయాలని గొల్ల, కురుమ సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నారు. ఎన్నికల ముందే జీవాల పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఆలస్యమైతే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ప్రక్రియ నిలిచిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే నెలాఖరు వరకు పూర్తి చేసేలా కసరత్తు..

గొర్రెల యూనిట్ల పంపిణీ మరింత వేగవంతం చేశాం. గైడ్ లైన్స్ ప్రకారం కొనుగోలు చేసి అందజేస్తున్నాం. వచ్చే నెలాఖరు వరకు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. కలెక్టర్ శశాంక పలుమార్లు సమీక్షలు నిర్వహించి వేగవంతం చేయాలని ఆదేశించారు.

-సుధాకర్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

వచ్చిపోయేటోళ్ల మాటలు నమ్మొద్దు..

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



చెక్కు అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: ఎన్నికల సమయంలో వచ్చిపోయేటోళ్ల మాయమాటలు నమ్మొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం శ్రీ తులసి మండల సమాఖ్య సంఘం ఏడో వార్షిక మహాసభ నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. తాను వచ్చాకే పాలకుర్తి నియోజకవర్గం ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. మీరంతా ఆశీర్వదిస్తే మిగిలిన పనులు పూర్తిచేస్తానన్నారు. ఎర్రబెల్లి ట్రస్టు ద్వారా సొంత నిధులతో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం, రాష్ట్రం బాగుపడుతుందన్నారు. 114 సమాఖ్య సంఘాలకు లింకేజీ రుణాలు రూ.7కోట్లు, సమాఖ్య సంఘాల్లోని 50 స్వయం సహాయక సంఘాలకు శ్రీనిధి రుణాల రూ.2 కోట్లు చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 8వ తేదీన తొర్రూరులో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నమన్నారు. అర్హత ఉన్నవారందరికీ ఉద్యోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మీ రామచంద్రయ్య శర్మ, నాయకులు ఈదురు ఐలయ్య, శ్రీరాం సుధీర్, సంజయ్, శ్రీనివాస్, సల్లెండి సుధాకర్, మల్లికార్జున్ చారి, జ్ఞానేశ్వర్ చారి, చిలుక భిక్షపతి, జిల్లా, మండల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ ఆధ్యాపకుల సంఘం జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదె వెంకన్న, ప్రధాన కార్యదర్శి యారా కుమార స్వామి తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా అనమాల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రాతిరం, కోశాధికారిగా ఎండీ రియాజ్, జాయింట్ సెక్రటరీగా భుక్య నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీని ఘనంగా సన్మానించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె వెంకన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ ఇంటర్ విద్యను బలోపేతం చేసి, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని, కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేసిన సీఎం కేసీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఒకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ జరిగేంత వరకు సంఘం తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మర్సకట్ల అనిల్ కుమార్, రాష్ట్ర బాధ్యులు బుర్రి రాజు, కూన సతీష్, హైదరాబాద్ జిల్లా బాధ్యులు తిరుపతి, జిల్లా ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల

నర్సింహులపేట: రాష్ట్రంలో బీజేపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని, బీఆర్ఎస్‌ను గద్దె దించడం ఖాయమని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో జగిరిన రైతు గోస.. బీజేపీ భరోసా సభకు పరకాల, వరంగల్ నుంచి కార్యకర్తలు, నాయకులు ప్రభంజనంలా తరలివస్తుండగా.. మండలంలోని పెద్ద నాగారం స్టేజీ వద్ద వారికి ఈటల వారికి స్వాగతం పలికారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పరకాల నియోజకవర్గం నుంచి డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరారని చెప్పారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని, పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేశారని ధ్వజమెత్తారు. ఇటీవల బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యేల జాబితాలో బీసీలకు, మహిళలకు అన్యాయం జరిగిందని, కేసీఆర్ మాయమాటలతో రెండుసార్లు అధికారంలోకి వచ్చారని, ఈసారి గద్దె దింపడం ఖాయమన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారం చేపడుతుందన్నారు. అనంతరం ఖమ్మం సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతిలాల్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ మురళీధర్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు రవీందర్, సదానందం, శివకుమార్, రాజ్‌కుమార్, దివాకర్ పాల్గొన్నారు.

నర్సరీల్లో ఎదిగిన మొక్కలనే నాటాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

పెద్దవంగర: నర్సరీల్లో ఎదిగిన పెద్ద పెద్ద మొక్కలనే ఖాళీ స్థలాల్లో నాటాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం పూర్తి కావడంతో ఆదివారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించి జీపీ కార్యాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, తదితర వాటిని పరిశీలించి కార్యదర్శుల పనితీరుపై అంచనా వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఎంపీఓ సత్యనారాయణ, ఆర్ఐ సల్కర్, అయా గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం వెల్లివిరియాలి

నెల్లికుదురు: జిల్లాలో పచ్చదనం వెల్లివిరియాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. మండలంలో పలు గ్రామాల్లో విధుల్లో చేరిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ పిరియడ్ పూర్తి కావడంతో.. వారు చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ నర్మదతో కలిసి అదనపు కలెక్టర్ డేవిడ్ పరిశీలించారు. పలు అభివృద్ధి పనులు, సంబంధిత రికార్డులతో పాటు హరితహారం, ఇంకుడు గుంతలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే పలు గ్రామాల్లోని పోలింగ్ బూతులను తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ శేషాద్రితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ పార్థసారథి, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీ మేరకు ఖాళీలను భర్తీ చేయాలి

నెహ్రూసెంటర్: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన మేరకు 13,500 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. ఏళ్ల తరబడి నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం సరైన సమయంలో ఉద్యోగ పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల వయసు పెరిగి నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ఖాళీలను ప్రస్తుతం నిర్వహించనున్న డీఎస్సీ ద్వారానే భర్తీ చేయాలన్నారు. సమ్మెట సురేష్, జి.శ్రీనివాస్, వీరేశం, గుగులోత్ రమేష్, వీరన్న పాల్గొన్నారు.

108 సంకీర్తనల సమారాధన మహాయజ్ఞం



సంగీత విభావరి నిర్వహిస్తున్న కళాకారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా ఆదివారం 108 సంకీర్తనల సమాహార మహాయజ్ఞాన్ని జయ శంకర్ సారస్వత సమితి ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు 108 సంకీర్తనలు, మూడు మంగళహారతులతో కార్యక్రమం ముగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భక్తి గీతాలతో అలరించారు. గడ్డం లక్ష్మయ్య, ధర్మకర్తలు అడప సమ్మయ్య, రాంరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు ఫణీంద్రశర్మ, ప్రశాంత్‌శర్మ, సంగీత వాయిద్యకారులు రమేష్‌చారి, శ్రీనివాసచారి, వావిళ్ల సారయ్య, నాగేశ్వర్ ఉన్నారు.

వేలిముద్ర వేయాల్సిందే..

- కార్మికశాఖలో అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేలా నిర్ణయం
- క్లెయిమ్ కావాలన్నా.. కార్డు పొందాలన్న ఫింగర్ ప్రింటే ప్రమాణికం
- లబ్ధిదారుడికి నేరుగా బీమా సొమ్ము చేరేలా చర్యలు
- ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తూ శాఖ నిర్ణయం

నెహ్రూసెంటర్: నిర్మాణరంగంలో పని చేస్తున్న కార్మికులకు మెరుగైన సేవలందించేందుకు కార్మిక శాఖ పూనుకుంది. లబ్ధిదారులకు నేరుగా బీమా సొమ్ము అందేలా ప్రభుత్వం, కార్మికశాఖ దరఖాస్తు విధానాన్ని మరింత కట్టుదిట్టం చేసి అమలు చేస్తోంది. శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు వేలిముద్ర విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసి కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తు సమర్పిస్తే లేబర్‌కార్డు పొందేవారు. కానీ ప్రస్తుతం కార్మికుడి వేలిముద్ర లేనిది కార్డులు పొందలేరు. అలాగే కార్మికుడి కుమార్తె వివాహం, డెలివరీకి వచ్చే బీమా సొమ్మును పొందాలన్న కార్మికుడు, నామినీ వేలు ముద్రలు వేయడం తప్పనిసరి. అయితే కొంత మంది కార్మికుల వేలిముద్రలు పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాత విధానాన్నే కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

వేలిముద్ర తప్పనిసరి..

బీమా సొమ్ము నేరుగా కార్మికుడు, లబ్ధిదారుడికి చేరేలా వేలిముద్ర విధానాన్ని కార్మికశాఖ అమలు చేస్తుంది. నిర్మాణరంగంలో పని చేస్తున్న కార్మికులు క్లెయిమ్‌లు, కొత్త కార్డుల కోసం కూడా వేలి ముద్ర వేస్తేనే ఆన్‌లైన్‌లో నమోదవుతుందని అధికా రులు తెలుపుతున్నారు. ఈ విధానం ద్వారా ఏజెంట్లు, దళారులకు బీమా సొమ్ము చేరకుండా నేరుగా కార్మికుడికి బ్యాంకుఖాతాలో జమ కానుంది.

అక్రమాలు జరగకుండా..

గతంలో లేబర్ కార్డులు పొందాలన్నా, బీమా సొమ్ము కార్మికుడి ఖాతాలో జమా కావాలన్నా ఏజెంట్లు చెప్పిందే విని వారు అడిగిన కాగితాలు ఇచ్చే వారు. దీంతో వారే స్వయంగా ఆన్‌లైన్ చేసి సంబంధిత కార్యాలయంలో అప్పగిస్తారు. బీమా సొమ్ము లబ్ధిదారుడికి చేరకుండా దళారులు కాజేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. వీటని దృష్టిలో పెట్టుకొని వేలిముద్ర విధాన్ని ప్రభుత్వం అమలు చేస్తూ.. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తోంది. ఈ విధాన వల్ల దళారీ, ఏజెంట్ల వ్యవస్థ తగ్గనుంది.

నేరుగా సంప్రదించాలి..



కార్మికులు ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తు ఫారాలను నేరుగా తీసుకువచ్చి కార్మికశాఖ కార్యాలయంలో సమర్పించాలి. దళారులను, ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం, కార్మికశాఖ కార్మికులకు నేరుగా సొమ్ము చేరేలా చర్యలు తీసుకుంటుంది. క్లెయిమ్‌ల దరఖాస్తులు చేసుకునేటప్పుడు తప్పనిసరిగా వేలిముద్ర వేయాల్సి ఉంటుంది.

- ఓ.రమేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్

నిరుద్యోగులకు నిరాశ

ఉమ్మడి జిల్లాలో 532 టీచర్ పోస్టులే..

- హనుమకొండలో భర్తీ చేయబోయేది 54 మాత్రమే..
- డీఎడ్, బీఈడీ అభ్యర్థుల ఆశలపై నీళ్లు
- అంతర్గతంగా రేషనలైజేషన్ చేశారని అనుమానం!



విద్యారణ్యపురి: డీఎస్సీ నోటిఫికేషన్‌లో టీచర్ పోస్టుల సంఖ్య ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ డీఎడ్, బీఈడీ అభ్యర్థులను నిరాశకు గురి చేసింది. పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో సుదీర్ఘ కాలంగా వేచి ఉన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. కొన్ని స్కూల్ అసిస్టెంట్ల సబ్జెక్టుల్లోనైతే వేళ్ల మీద లెక్కపెట్టేంత ఖాళీలే చూపారు. పోస్టుల సంఖ్య తక్కువగా ఉందని ఈనెల 25న హైదరాబాద్‌లో అభ్యర్థులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 5,089 టీచర్ పోస్టుల్ని భర్తీ చేయనున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు 1523 భర్తీ చేయనున్నారు. గతంలో 13,500ల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి చాలావరకు పోస్టుల్ని తగ్గించడంతో అభ్యర్థులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు

అంతర్గతంగా రేషనలైజేషన్ చేశారా?

విద్యాశాఖ ఉన్నతాధికారులు టీచర్ పోస్టుల భర్తీకి ఉపక్రమించే ముందే అంతర్గతంగా టీచర్ల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందుకే పోస్టుల భర్తీచేసే టీచర్ల పోస్టులను బాగా తగ్గించారని తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉండడం, మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువుండి ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు. గురుకులాల సంఖ్య పెరగడంతో ఈవిద్యాసంవత్సరంలోనూ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

పదోన్నతులు కల్పిస్తే పోస్టులు పెరిగేవి..

అన్ని జిల్లాల్లోనూ ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్ మెంట్ (సర్దుబాటు) చేశారు. ఇటీవల అన్ని జిల్లాల నుంచి విద్యా శాఖ ఉన్నతాధికారులు విద్యార్థుల సంఖ్య, టీచర్ల వేకెన్సీల సంఖ్యను తీసుకున్నారు. ప్రతీ జిల్లాలో చాలానే వేకెన్సీలున్నాయి. వేకెన్సీల్లోనూ పదోన్నతుల ద్వారా 70 శాతం, డైరెక్ట్ రిక్రూట్ మెంట్ ద్వారా 30 శాతం భర్తీ చేస్తారు. టీచర్ల పదోన్నతులు జరిగి ఉంటే కూడా కొన్ని పోస్టులు పెరిగేవి. కానీ కొన్నేళ్లుగా పదోన్నతుల ప్రక్రియ జరగేలేదు. పాఠశాలల్లో మరో వైపు విద్యార్థుల సంఖ్యను బట్టి పోస్టులను భర్తీ చేయబోతున్నారనేది స్పష్టమవుతోంది. వివిధ జిల్లాల్లో జీరో సంఖ్య ఉన్న పాఠశాలలు కూడా ఉన్నాయి. అలాగే 10లోపు ఉన్నవి కూడా ఉన్నాయి. డీఎస్సీ రాసే అభ్యర్థులు 40 నుంచి 50వేల మంది వరకు ఉండే అవకాశం ఉంది. తక్కువ పోస్టులు.. ఎక్కువ మంది అభ్యర్థులున్న నేపథ్యంలో ఒక్కో పోస్టుకు తీవ్ర పోటీ ఉండే పరిస్థితి ఉంది.

పోస్టుల భర్తీ ఇలా..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 532 పోస్టులను భర్తీ చేయనున్నారు.
- హనుమకొండ జిల్లాలో మొత్తం 54 పోస్టులు భర్తీ చేయనున్నారు. అందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 21, ఎస్‌జీటీలు 21, పీఈటీ 7, ఎల్‌పీ పండిట్లు 5 పోస్టులు ఉన్నాయి.
- వరంగల్ జిల్లాలో 138 పోస్టులు భర్తీ చేయనున్నారు. అందులో ఎస్ఏలు 56, ఎస్‌జీటీలు 55, పీఈటీలు 6, ఎల్‌పీలు 21.
- మహబూబాబాద్ జిల్లాలో 125 ఖాళీలు ఉండగా.. ఎస్ఏలు 35, ఎస్‌జీటీలు 69, పీఈటీలు 2, ఎల్‌పీలు 19 భర్తీ చేయనున్నారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 74 ఖాళీలు చూపగా.. ఎస్ఏలు 12, ఎస్‌జీటీలు 38, పీఈటీలు 7, ఎల్‌పీలు 17 భర్తీ చేయనున్నారు.
- జనగామ జిల్లాలో 76 పోస్టులకుగాను ఎస్ఏలు 23, ఎస్‌జీటీలు 29, పీఈటీలు 7, ఎల్‌పీలు 17 భర్తీ చేయబోతున్నారు.
- ములుగు జిల్లాలో 65 పోస్టులు భర్తీ చేయబోతున్నారు. అందులో ఎస్ఏలు 16, ఎస్‌జీటీలు 33, పీఈటీ1, ఎల్‌పీలు 15 భర్తీ చేయబోతున్నారు.

శ్రావణ సందడి

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రావసమాసం, ఆదివారం సెలవురోజు కావడంతో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమగోదావరిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. అనంతరం శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో మహిళలకు కుంకుమార్చన పూజలు చేశారు. దీంతో ఆలయానికి రూ.1.58లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారుల ద్వారా తెలిసింది. గోదావరి తీరం, ఆలయ పరిసరాల్లో భక్తుల సందడితో శ్రావణశోభ సంతరించుకుంది.

గర్భగుడిలో అభిషేక పూజలు చేస్తున్న భక్తులు →



క్లుప్తంగా

జనగామ టికెట్ గౌడ కులస్తులకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిర్ర రాజు

జనగామ రూరల్: రాబోయే ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో అధిక జనాభా ఉన్న గౌడ కులానికి చెందిన నాగపూరి కిరణ్‌కుమార్‌కు ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ చిర్ర రాజు గౌడ్ ముఖ్యమంత్రిని కోరారు. ఆదివారం పట్టణంలోని వైఎస్‌ఆర్ భవన్‌లో జిల్లా గోపా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు అధ్యక్షతన గౌడ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిర్ర రాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న కిరణ్‌కుమార్‌కు అధిష్టానం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని కోరారు. ఇతరులకు టికెట్ ఇస్తే గౌడ కులస్తులు ఐక్యమై ఓడిస్తామని ఏకగ్రీవంగా నిర్ణయించారు. కార్యక్రమంలో నాయకులు కన్నా పర్శరాములు, తరిగొప్పుల ఎంపీపీ హరిత సుదర్శన్, ఎంపీటీసీలు బాలరాజు, తీగల సిద్ధూ, శివశంకర్, బాలకృష్ణ, వేముల లక్ష్మణ్, సిద్ధయ్య, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెమలి అప్పగింత



నెమలిని ఎస్సైకి అప్పగిస్తున్న పస్తం రాజేందర్, తదితరులు

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని శంభునిపేట సమీపంలోని బుడుగ జంగాల కాలనీకి జాతీయ పక్షి నెమలి ఆదివారం మధ్యాహ్నం చేరుకుంది. సామాజిక కార్యకర్త ఎండి ఫసీ ఆధ్వర్యంలో స్థానికులు గంధం రాజేందర్, పస్తం రాజేందర్, శ్రీనివాస్ నెమలిని మిల్స్ కాలనీ ఎస్సై ముస్సీరుల్లాకు అప్పగించారు. నెమలిని పోలీసులు హనుమకొండలోని వన విజ్ఞాన కేంద్రంలో అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి : టీఎస్‌కే తండాలో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్ : ప్రజలు తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే రాష్ట్రంలో మరింత అభివృద్ధి పనులు జరుగుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మంత్రి మండలంలోని అభివృద్ధి పనుల కార్యక్రమంలో భాగంగా హట్యాతండా, భీక్యానాయక్ తండా, పెద్దతండా, పెద్దతండా (కొండాపురం) టీఎస్‌కే తండాల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పలువురు గిరిజనులతో మంత్రి నృత్యం చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 24 గంటలు విద్యుత్ కావాలా లేక మూడు గంటలే కావాలా అనే విషయాన్ని ప్రజలు తేల్చుకోవాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రూ. 20 లక్షల వ్యయంతో కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, సహకార సొసైటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల నుంచి ఆదివారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మెరుగు వెంకటయ్య ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్ విజయానికి తోడ్పాటు అందించండి

దేవరుప్పుల : ప్రత్యేక రాష్ట్ర తరహాలో దేశ సమగ్రాభివృద్ధి కోసం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు బీఆర్‌ఎస్ అఖండ విజయానికి పాత, కొత్త క్యాడర్ తేడా లేకుండా తోడ్పాటు అందించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. ఆదివారం చిన్నమడూరులో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మేడ సునిత సోమనర్సయ్య స్వగృహంలో ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం సింగరాజుపల్లిలో కాంగ్రెస్ నాయకులు భూమండ్ల వెంకన్న, ఐలయ్య, కర్రె స్వామి, జోగు భద్రయ్య, మహేందర్, పరశురాములు, కత్తుల సందీప్ తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, మండల సమన్వయకర్తలు పల్లా సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేశం, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్, సర్పంచ్ మల్లేషం, మేకపోతుల నర్సింహులు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

దిల్ ఖుష్‌గా మంత్రి..

మండల కేంద్రంలో టీ పాయింట్ వద్ద పిచ్చపాటిగా మాట్లాడుతూ మంత్రి దిల్‌ఖుష్‌గా కనిపించారు. కామారెడ్డిగూడేనికి చెందిన మహేందర్ కార్యకర్త రేబాన్ అద్దాలతో కనిపించగా కళ్లకలకలా.. సోకద్దలా..? అంటూ తన పీఏలతో బ్లాక్ అద్దాలు తెప్పించుకొని తాను పెట్టుకొని బాగున్నాయంటూనే టీ తాగి వెళ్లిపోయారు.

అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో ప్రతిభ



కప్ గెలుచుకున్న టీం సభ్యులతో గణేష్

- రాణించిన మన్‌సాన్‌పల్లి విద్యార్థి గణేష్
- అభినందించిన కళాశాల యాజమాన్యం

బచ్చన్నపేట: ఇండో నేపాల్ అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన పంజాల గణేష్ ప్రతిభను కనబర్చాడు. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి ఇద్దరు, వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. జనగామ ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న గణేష్ అండర్-17 విభాగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాడు. గణేష్ తల్లి పంజాల తార సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. చిన్నప్పటి నుంచే గణేష్‌కు కబడ్డీ అంటే ఎంతో మక్కువ అని తల్లి తార వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం గణేష్‌ను అభినందించింది.

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం



రుద్రాక్షలను పరిశీలిస్తున్న ఉపేంద్ర శర్మ

హన్మకొండ : హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఉపేంద్ర శర్మ మాట్లాడారు. శ్రావణ మాసంలో రుద్రాక్షలు ధరిస్తే ఆరోగ్యం, ఐశ్వర్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని చెప్పారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రుద్రాక్షలు ధరిస్తే సత్ఫలితాలు లభిస్తాయని తెలిపారు. ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలు, స్ఫటిక తులసి, నరవత్న మాలలు, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలీగ్రాములు, మర్కట శివలింగాలు. దైవికమైన వస్తువులు ఎగ్జిబిషన్‌లో ఉన్నాయని వివరించారు. సెప్టెంబర్ 4 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని చెప్పారు.

దిగివస్తున్న కూరగాయల ధరలు

- లోకల్ పంట వస్తే మరింత ఉపశమనం



వరంగల్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు దెబ్బతిని ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు దిగివస్తున్నాయి. వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌కు టమాట అనంతపురం జిల్లా మదనపల్లి, కర్ణాటక భాగ్యపల్లి ప్రాంతాల నుంచి, మిర్చి కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి వస్తుంది. క్యారెట్, బీన్స్, క్యాప్సికం, బీట్‌రూట్, క్యాలీఫ్లవర్, క్యాబేజీ బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు.. అక్కడి నుంచి ఇక్కడికి కమీషన్ వ్యాపారులు పంపిస్తారు. జూలై మొదటి వారంలో క్వింటా రూ.3వేల నుంచి రూ.4వేలు ఉన్న టమాట ఈనెల ప్రారంభం నుంచి పెరిగి.. నాలుగో తేదీన క్వింటా టమాట, పచ్చిమిర్చి ధర రూ.10వేల వరకు చేరింది. మిగిలిన కూరగాయల ధరలు సైతం పెరిగాయి. టమాట ధర ఇలా ఆకాశాన్నంటడం ఇప్పటి వరకు చూడలేదని పలువురు మార్కెట్ వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు లేక పోవడం, కొత్తగా వేసిన పంట చేతికి వస్తుండడతో కూరగాయల ధరలు తగ్గు ముఖం పట్టాయి. ప్రస్తుతం కిలో టమాట రూ.15-రూ.30, పచ్చిమిర్చి రూ.50, బెండకాయ రూ.20-రూ.30, వంకాయ రూ.15-రూ.20, చిక్కుడుకాయ(పలక) రూ.30-రూ.40, గోరుచిక్కుడు రూ.20-రూ.40, బీన్స్ రూ.60-రూ.80, క్యారెట్ రూ.50-రూ.60, క్యాలీఫ్లవర్ రూ.30-రూ.40, క్యాబేజ్ రూ.15-రూ.20లకు విక్రయిస్తున్నారు.

బీజేపీలో డాక్టర్ కాళీప్రసాద్ చేరిక



అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరుతున్న డాక్టర్ కాళీప్రసాద్

ఎంజీఎం: వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, గార్డియన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కాళీప్రసాద్ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన 'రైతు-గోస బీజేపీ భరోసా' బహిరంగ సభకు ఐదు వేల మంది కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులతో కలిసి తరలివెళ్లిన డాక్టర్ కాళీప్రసాద్ కాషాయ కండువా కప్పుకున్నారు. ఆయన చేరికతో పరకాల బీజేపీలో నూతనోత్తేజం నిండిందని సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వెయ్యేళ్ల నాటి వరదపాశం బండ

- వెల్ది పాండవుల గుట్టపై గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



వెల్దిలో వరద పాశం బండను పరిశీలిస్తున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలోని పాండవుల గుట్టపై దాదాపు వెయ్యేళ్ల నాటి వరద పాశం బండను చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి ఆదివారం వెలుగులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వెయ్యేళ్ల క్రితం శిలాయుగంలో ఆదిమానవుల జీవన విధానం, అప్పటి ఉత్సవాలకు గుర్తు ఈ వరదపాశం బండ అని తెలిపారు. నాడు పాయసం ఒక్కో చోట ఉండేలా వందకు పైగా తొలచిన చిన్న బద్దులు ఉన్నాయని, ఈ బండపై వరద పాశం పండుగ పూర్వ కాలం నుంచి నేటికీ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని నాటి నుంచి పూర్వీకుల మాదిరిగా ఈ గుట్టపై ముదిరాజ్ కులస్తులు ఏటా మూడు ఆదివారాలు వరద పాశం పండుగ జరుపుకుంటున్నారని చెప్పారు. క్రీస్తు పూర్వం ఐదువేల యేళ్ల క్రితం నవీన శిలాయుగం, రెండు వేల యేళ్ల కిందటి బృహత్ శిలాయుగం మొదలుకొని, ఒకటవ శతాబ్దం నుంచి నేటి వరకు పాండవుల గుట్ట కేంద్రంగా మానవ జీవితం కొనసాగుతున్నదని వివరించారు.

పోగొట్టుకున్న బ్యాగు, బంగారు ఆభరణాల అప్పగింత



బ్యాగును మహిళకు అప్పగిస్తున్న ఏసీపీ భోజరాజు

వరంగల్ క్రైం : ఓ మహిళలు బ్యాగుతోపాటు 20 తులాల బంగారు ఆభరణాలు పోగొట్టుకోగా పోలీసులు కొన్ని నిమిషాల వ్యవధిలోనే గుర్తించి ఆమెకు అప్పగించారు. ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు కథనం ప్రకారం.. వరంగల్ కాశిబుగ్గ సమీపంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కందకట్ల జోత్స్న శనివారం రాత్రి 20 తులాల బంగారు ఆభరణాలకు మెరుగు పెట్టించుకుని వరంగల్ చౌరస్తా బట్టల బజార్ నుంచి కాశిబుగ్గకు ఆటోలో చేరుకుంది. ఈ క్రమంలో ఆమె ఆటోలో తన బ్యాగు మర్చిపోయి ఇంటికి వెళ్లింది. అనంతరం బ్యాగు, అందులో 20 తులాల బంగారు ఆభరణాలున్న విషయం గుర్తుకొచ్చి వెంటనే కాశిబుగ్గ చౌరస్తాకు చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు రవికి సమాచారం ఇచ్చింది. ఆయన మ్యాన్‌ప్యాక్ ద్వారా ఇన్‌స్పెక్టర్ వెంకన్నకు, సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు అన్ని ఆటో స్టాండ్లు, యూనియన్లకు సమాచారం అందించారు. అదే సమయంలో ఆటో డ్రైవర్ బ్యాగ్‌ను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం బాధిత మహిళను ఏసీపీ భోజరాజు పిలిపించి బ్యాగ్ అప్పగించారు. అనతికాలంలోనే తన బ్యాగును అప్పగించారంటూ పోలీసులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఎస్సై శ్రవణ్‌కుమార్, హోంగార్డు రవి పాల్గొన్నారు.

సర్వేయర్‌లే టార్గెట్!

ఏసీబీ కేసు నుంచి తప్పిస్తామంటూ టోకరా
- అనుమానం వచ్చి అధికారులను ఆశ్రయించిన బాధితులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుడి అరెస్టుకు రంగం సిద్ధం

నల్లబెల్లి : సైబర్ నేరస్తులు కొత్త కొత్త రీతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. నిరుద్యోగులకు జాబ్స్ పేరిట.. లంచాలు తీసుకున్న వారిని ఏసీబీ కేసు నుంచి తప్పిస్తామంటూ టోకరా వేస్తున్నారు. తాజాగా ఇలాంటి మోసానికి ఓ వ్యక్తి పాల్పడగా పోలీసులు సదరు వ్యక్తిని అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకుంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లోని సర్వేయర్‌గా పని చేస్తున్న కొందరు ఉద్యోగులను మోసం చేస్తూ డబ్బులు దండుకుంటున్నాడు.

మోసానికి పాల్పడుతున్న తీరు ఇలా..

కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయాల్లో పని చేస్తున్న సర్వేయర్లతో తనకు తాను ఏసీబీ అధికారినని పరిచయం చేసుకున్నాడు. మీరు లంచాలు తీసుకున్నారని చెప్పి డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ సర్వేయర్‌గా పని చేస్తున్న మల్లయ్యకు ఈ నెల 16న ఓ వ్యక్తి ఫోన్ చేసి తనకు తాను ఏసీబీ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'నువ్వు లంచం తీసున్న ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. ఈ కేసు నుంచి నిన్ను తప్పించేందుకు లక్ష రూపాయలు ఇవ్వాలి' అని డిమాండ్ చేశాడు. ఇవ్వకపోతే కేసు నమోదు చేస్తామని బెదిరించాడు. అదే రోజు పర్వతగిరి మండలంలో పని చేస్తున్న సర్వేయర్ శ్యామూల్‌కు అదే వ్యక్తి ఫోన్ చేసి ఏసీబీ కేసు నుంచి తప్పించేందుకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకపోతే కేసు నమోదు చేస్తామని ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డాడు. అలాగే నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని సర్వేయర్లకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. ఇంతటితో ఆగకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలోని పలువురు సర్వేయర్లకు ఫోన్లు చేసి ఏసీబీ కేసుల నుంచి మిమ్మలను తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. ఇందుకోసం గూగుల్‌పే, ఫోన్‌పేలో డబ్బులు పంపాలని డిమాండ్ చేశాడు. సందేహం వచ్చిన సదరు ఉద్యోగులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నిందితుడితో జరిగిన సంభాషణ, ఫోన్ నంబర్ వివరాలు అందించారు. దీంతో ఏసీబీ అధికారులు ఏసీబీ అధికారుల ముసుగులో సర్వేయర్లను నమ్మించి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. సదరు నిందితుడికి డబ్బులు పంపించవద్దని సర్వేయర్లకు స్పష్టం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసి అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

దడువాయి యూనియన్ పాలకవర్గం రాజీనామా

వరంగల్ : ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ దడువాయి యూనియన్ పాలకవర్గం గడువు తీరిపోవడంతో రాజీనామా చేసినట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మార్త శ్యాంసుందర్, అప్పని కృష్ణ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక కోసం ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. సభ్యులు గమనించాలని కోరారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



రఘురాం (ఫైల్)

పరకాల : విద్యుద్ఘాతానికి గురై ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని సీతారాంపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సీతారాంపూర్‌కు చెందిన బస్వాజు మహేందర్ కొడుకు రఘురాం (17) ఇంటర్ చదువుతున్నాడు. ఇంటి నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ గుంతలోకి శనివారం కురిసిన వర్షానికి చేరిన నీటిని మోటర్ సాయంతో బయటకు తీస్తుండగా మోటర్‌ను పక్కకు జరిపిన రఘరాం విద్యుద్ఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు విద్యుత్ సరఫరా నిలిపేసి రఘురాంను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. రఘురాం మృతితో సీతారాంపూర్‌లో విషాదం నెలకొంది. మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



సురేష్ (ఫైల్)

వాజేడు : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జగన్నాథపురం జంక్షన్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని మండపాక గ్రామానికి చెందిన చిచ్చెడి సురేష్ (35) కాలినడకన స్వగ్రామానికి వెళ్తుండగా వెంకటపురం (కె) వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

మొగుళ్లపల్లిలో పల్సర్ ఢీకొని..



రమేష్ (ఫైల్)

మొగుళ్లపల్లి : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జమ్మికుంట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కల్లెపల్లి రమేష్ (38) ఆదివారం ఉదయం బైక్‌పై చిట్యాల మండలంలోని కోటంచ ఆలయానికి వెళ్లి వస్తుండగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఎంజేపీ స్కూల్ ఎదుట వేములపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ హఫీజ్ మరో పల్సర్ వాహనంపై వేగంగా వస్తూ అజాగ్రత్తగా నడుపుతూ రమేష్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించగా మధ్యలోనే పరిస్థితి విషమించి రమేష్ మృతి చెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..



సారయ్య (ఫైల్)

శాయంపేట : మండలంలోని జోగంపల్లి గ్రామానికి చెందిన రాపర్తి సారయ్య (75) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. సారయ్య ఎడమ కాలు ఇన్ఫెక్షన్‌కు గురి కాగా వైద్యులు శస్త్రచికిత్స చేసి ఒక వేలు తొలగించారు. మందులు వాడినా కాలు నొప్పి తగ్గకపోవడంతో సారయ్యను అతడి కొడుకు భిక్షపతి మళ్లీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. కాగా కాలు తీసేస్తారే ఆందోళనతో సారయ్య శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కొడుకు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో మునిగి..



వాజేడు : వాగు వద్ద జానకయ్య మృతదేహం

వాజేడు : వాగులో మునిగి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, కృష్ణాపురం సర్పంచ్ కథనం ప్రకారం.. కృష్ణాపురం గ్రామానికి చెందిన మడె జానకయ్య (60) చేపలు పట్టేందుకు మోడికుంట వాగుకు శనివారం సాయంత్రం వెళ్లాడు. వాగులో వల పెడుతుండగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు, చేతులకు చుట్టుకుంది. దీంతో జానకయ్య ప్రమాదవశాత్తు అదుపుతప్పి లోతుగా ఉన్న గుంతలో పడి మునిగిపోయాడు. వల అడ్డం పడటంతో బయటకు రాలేక చనిపోయాడు. జానకయ్య ఇంటికి రాకపోవడంతో కొడుకులు, గ్రామస్తులు వెళ్లి చూడగా ఒడ్డుపైన జానకయ్య పంచె కనిపించింది. అనుమానంతో వాగులో గాలించగా ఆదివారం ఉదయం మృతదేహం లభించింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య నలుగురు పిల్లలున్నారు.

బీసీలకు సీట్లు ఇవ్వకుంటే రాజకీయ సమాధి చేస్తాం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బైరి రవికృష్ణ

జనగామ రూరల్: రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు సరైన విధంగా సీట్లు ఇవ్వకుంటే పార్టీలను రాజకీయ సమాధి చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా అధ్యక్షుడు దూడల సిద్ధయ్య అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 60 శాతం ఉన్న బీసీలకు 23 సీట్లు బీఆర్‌ఎస్ పార్టీ కేటాయించడం 5 శాతంగా ఉన్న రెడ్డిలకు 40 సీట్లు, ఆరు శాతం ఉన్న వెలమలకు 11 సీట్లు ఇవ్వడం దారుణమన్నారు. కాంగ్రెస్, బీజేపీలు జనాభా ప్రాతిపదికన బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 10 తలపెట్టిన బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎదునూరి రాజమౌళి, ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సిద్ధు, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి భాజీపేట్ వెళ్లు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27212]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27215]

HOUSE FOR SALE/RENT

■హన్మకొండ హంటర్ రోడ్ సమీపంలో 280 చ॥గ॥లో 3BHK ఇండిపెండెంట్ హౌజ్ అమ్మకానికి లేదా అద్దెకు ఇవ్వబడును. సెల్: 9949184625. [W-189153]

SERVICES

■సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189136]

BUSINESS OFFER

■Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకము లైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్ట్ కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

■శ్రీరామ్ గోల్డ్: మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించలేకపోతున్నారా? తాకట్టు లో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9133214214. [H-788623]

WANTED

■హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000-16000. సెల్: 9703637320 [W-189147]

■GNM Nurses & Experienced Lab Technicians required for Guardian Hospital, Opp: LB College, Mulugu "X" Road, WGL. 12 to 2PM. [WA-963]

■WGL, మండిబజార్ Exclusive డ్రైఫ్రూట్ షాప్‌లో సేల్స్ చేయుటకు ఆసక్తిగల యువతులు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. సాలరీ: 10000-12000. సెల్: 9177395934. [WA-602]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

WANTED TEACHERS

■Wanted Hindi and supporting Lady Teachers for 1st to 5th Classes Indian Kids High School, SVN Road, Warangal. Cont No: 9963006221. [W-189143]

■Wanted Applications from Qualified and experienced teachers having excellent communcation skills for all subjects (Pre Primary, Primary and Upper Primary) Salary: 10K to 12K, IIT, Bilology & Telugu (High School) Salary: 10K to 20K. Contact Immediately. Shantiniketan High School, Near Durgeshwara Swamy Temple, Warangal, Cont No: 7995850051. [WA-16683]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.